
శ్రీహరి సన్నిధిలో ఉట్లోత్సవం





తిరుమల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో బుధవారం ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరుసటి రోజు ఉట్లోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా మలయప్పస్వామి, కృష్ణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెద్దజీయర్ మఠానికి తీసుకొచ్చి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.పెద్దజీయర్ మఠం, హథీరాంజీమఠం హారతి పొంది తిరిగి ఆలయం వద్దకు వేంచేశాక శ్రీవారి ఆలయం ముందు గొల్లమండపం పక్కనే ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. స్థానిక యువతతో పాటు పలువురు భక్తులు కూడా పాల్గొన్నారు.టీటీడీ జీయర్‌స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్‌లో శ్రీవారి అంగప్రదక్షిణ టోకెన్లు

రూ.500 డిపాజిట్ తప్పనిసరి : టీటీడీ

తిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరవాసులతో పాటు తిరుమలవాసులకు ప్రతి శనివారం కేటాయిస్తున్న 250 శ్రీవారి ఆలయ అంగప్రదక్షిణ టోకెన్లను ఇకపై లక్కీడిప్ ద్వారా కేటాయించనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో రోజూ 750 టోకెన్లను తిరుమలలోనే ఆఫ్‌లైన్ ద్వారా కేటాయించేవారు. అయితే క్యూలైన్లలో భక్తుల నిరీక్షణ సమయాన్ని మరింత తగ్గించే ఉద్దేశంతో ఈ టోకెన్లను కూడా ఆన్‌లైన్ ద్వారానే కేటాయించేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే కొందరు స్థానికులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన నేపథ్యంలో ప్రతి శనివారం 250 టోకెన్లను స్థానిక ఎమ్మెల్యేకు బదిలీ చేస్తూ వచ్చారు. ఆన్‌లైన్‌లో మిగతా రోజులకు 750 టోకెన్లు కేటాయిస్తే శనివారం 500 టోకెన్లు మాత్రమే కేటాయించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి శనివారం ఇచ్చే ఈ 250 టోకెన్లను కూడా ఆన్‌లైన్‌లోనే పెట్టాలని టీటీడీ తాత్కాలికంగా నిర్ణయం తీసుకుని గత శనివారానికి సంబంధించిన టోకెన్లను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ విషయంలో టీటీడీ శాశ్వత నిర్ణయం తీసుకుంది. అంగప్రదక్షిణ టోకెన్లు కావాల్సిన భక్తులు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వీరికి సాయంత్రం 5 గంటలకు లక్కీడిప్ ద్వారా టోకెన్లు కేటాయిస్తారు. డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులు వారి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా ఆ సమాచారం ఉంచుతారు. డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులు ఆన్‌లైన్‌లోనే రూ.500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. లక్కీడిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులు తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తమ ఆధార్ కార్డు చూపి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అంగప్రదక్షిణ టోకెన్లు పొందాల్సి ఉంటుంది. వీరిని శనివారం వేకువజామున అంగప్రదక్షిణకు అనుమతిస్తారు. అనంతరం భక్తులు చెల్లించిన రూ.500 డిపాజిట్‌ను తిరిగి వారి ఖాతాల్లోకే టీటీడీ జమచేస్తుంది. తిరుపతి నియోజకవర్గానికి చెందని భక్తులు లక్కీడిప్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు పొందితే డిపాజిట్ తిరిగి చెల్లించమని, అంగప్రదక్షిణకు అనుమతించబోమని టీటీడీ స్పష్టం చేసింది.

రాజీవ్‌నగర్ అక్రమాలపై సమగ్ర విచారణ

● 57బృందాలతో సమగ్ర సర్వే

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 : శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్ కాలనీలో యేళ్ల తరబడి జరిగిన భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు.2005లో పేదల కోసం ఇళ్ల స్థలాలు కేటాయించిన రాజీవ్‌నగర్‌లో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున ఆక్రమణలు జరిగినట్లు విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ అంశంపై బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 15రోజులుగా రాజీవ్‌నగర్ కాలనీలో ఇళ్ల స్థలాలపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. లబ్ధిదారుల నుంచి తాము కొనుగోలు చేసిన స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటూ పెద్దఎత్తున ప్రజలు కార్యాలయానికి వస్తున్నట్లు వివరించారు. అలాగే తమ పేరుతో పట్టాలున్న స్థలాల్లో ఇతరులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని కొంతమంది నుంచి ఫిర్యాదులందుతున్నాయని చెప్పారు. రోజూ తహసీల్దారు కార్యాలయానికి రాజీవ్‌నగర్ సమస్యలపైనే ప్రజలు అధికంగా రావడం జరుగుతోందన్నారు. లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకు విజిలెన్స్ శాఖ నివేదిక కోరిందని, ఈనెల 30వ తేదీన రాజీవ్‌నగర్‌లో గందరగోళ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు 57 బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర సర్వే చేపడతామని తహసీల్దారు వెల్లడించారు.

నాయుడుపేట గురుకులంలో మరోసారి కలకలం

● గత నెల ఘటన మరువక ముందే కలుషితాహారంతో 12మందికి అస్వస్థత

● గోప్యంగా ఉంచిన అధికారులు



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్

నాయుడుపేట/నాయుడుపేట టౌన్,ఆగస్టు 28: నాయుడుపేట బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మరోసారి కలకలం రేగింది.గత నెల 15వ తేదీ కలుషితాహారంతో సుమారు 150మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలైన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి కార్యాలయం ఈ ఘటనపై ఆరా తీసి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించడం, మంత్రి బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ, ఉన్నతాధికారులు గురుకులాన్ని తనిఖీ చేసి పారిశుధ్య లోపం ఉన్నట్లుగా గుర్తించడం,సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రభుత్వానికి నివేదికలు పంపడం తెలిసిందే.అలాగే రూ.56 లక్షలను కేటాయించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.అయితే ఆ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంతో గురుకుల సిబ్బంది పనితీరులో మార్పురానేలేదు.ఈ క్రమంలోనే మరోసారి 12మంది విద్యార్థులు కలుషితాహారంతోనే ఆస్పత్రి పాలయ్యారు. గురుకుల పాఠశాలలో మంగళవారం రాత్రి భోజనంలో చికెన్ వడ్డించారు.ఇక్కడున్న 650 మంది విద్యార్థుల్లో 380 మంది మాత్రమే చికెన్ తిన్నారు. తిన్న కాసేపటికే కొంతమంది విద్యార్థులు కడుపునొప్పితో అల్లాడిపోయారు. ఆపై వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. అక్కడే ఉన్న వార్డెన్‌కు తమ పరిస్థితిని వివరించారు. ఆయన సూచనల మేరకు పాఠశాల కాంపౌండర్ వద్దకెళ్లి ఆయన ఇచ్చిన మందులను వేసుకున్నారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సిబ్బంది వారిని నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న హెల్త్‌సబ్ సెంటర్‌కు తరలించి వైద్యం అందించారు.ఈ ఘటనను బయటకు తెలియనీయకుండా చేయాలని గురుకులం అధికారులు విశ్వప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే నాయుడుపేట పట్టణంలో పీహెచ్‌సీ ఉండగా, అక్కడికి తీసుకువెళ్లకుండా ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యాన్ని అందించి అప్పటికప్పుడు కొంతమంది విద్యార్థులను ఇళ్లకు పంపివేయడం చర్చనీయాంశమైంది.సోషల్‌మీడియాలో ఈ విషయాన్ని తెలుసుకున్న తహసీల్దారు గీతావాణి హుటాహుటిన పాఠశాలకు వెళ్లి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేసినట్లుగా సమాచారం. దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ దాదాపీర్ మాట్లాడుతూ... 380మంది విద్యార్థులు చికెన్ తినగా అందులో 12మంది మాత్రమే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.చికెన్ చెడిపోయివుంటే అందరూ అస్వస్థతకు గురికావాలి కదా అన్నారు.



చికిత్స పొందుతున్న విద్యార్థులు మహేష్, హరి

మ్యూచువల్ అయితేనే బదిలీకి ఆమోదం

● ముగ్గురు కలెక్టర్ల నిర్ణయం

● రేపు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్

చిత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్న విషయం తెలిసిందే. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతి జిల్లాకు వెళ్లేందుకు ఎక్కువ మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఓ నిర్ణయం తీసుకునేందుకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్, శ్రీధర్ బుధవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించుకున్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి అనుమతిస్తే ఈ రెండు జిల్లాలు ఖాళీ అయిపోతాయని కలెక్టర్లు సుమిత్‌కుమార్, శ్రీధర్ అభిప్రాయపడ్డారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ అయితే తప్ప, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. ఈ లెక్కన తిరుపతి నుంచి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవాళ్లు లేకపోవడంతో బదిలీలు ఎక్కువ స్థాయిలో జరగకపోవచ్చు.ఇప్పటికే కు ప్పం నియోజకవర్గంలోని ప్రతి శాఖలోనూ ఉద్యోగుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. సీఎం నియోజకవర్గంలో ఖాళీల్ని భర్తీ చేయాల్సిన అవసరముంది.ఈ నేపథ్యంలో చిత్తూ రు జిల్లా నుంచి ఉద్యోగుల్ని మ్యూచువల్ లేకుండా రిలీవ్ చేసే అవకాశాలు లేవు.

1740 మంది సచివాలయ ఉద్యోగుల దరఖాస్తు

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు శుక్రవారం కౌన్సెలింగ్ జరగనుంది. మూడు జిల్లాల పరిధిలో ఇప్పటికి మొత్తం 1740 దరఖాస్తులు అందాయి. ఇందులో మ్యూచువల్ కోసం 183, మెడికల్ గ్రౌండ్స్ కింద 114 దరఖాస్తులున్నాయి. మిగిలినవన్నీ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్సే ఉన్నాయి. ఇక్కడ కూడా మ్యూచువల్ బదిలీలకే ప్రాధాన్యమిస్తున్నారు. సింగిల్ పేరెంట్, స్పౌస్, డిసేబుల్డ్ పేరెంట్స్, చిల్డ్రన్స్ వంటి సమస్యలున్నవారికి మానవతా దృక్పథంతో బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయి. అది కూడా అందరికీ కాకుండా అర్హులను గుర్తించి ప్రాధాన్యమిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీలోని వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అనంతపురంలోని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. కానీ, ఓ జిల్లా ఉద్యోగుల్ని మరో జిల్లాకు బదిలీ చేయాలంటే తొలుత ఆయా మున్సిపల్ కమిషనర్ల నో డ్యూ సర్టిఫికెట్ సంపాదించాలి. ఆ తర్వాత కలెక్టర్లు అర్హతల్ని పరిశీలించి రిలీవ్ చేయాల్సి ఉంటుంది.

స్విమ్స్‌లో రోగి అదృశ్యం

● అధికారులు పట్టించుకోక పోవడంతో వెస్ట్ పోలీసులకు కుమారుడి ఫిర్యాదు



తిరుపతి (వైద్యం), ఆగస్టు 28 : ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న రోగుల భద్రత పూర్తిగా ఆ ఆస్పత్రి అధికారులదే. అయితే ఆరోగ్యం క్షీణించి ఎంఐసీయూలో చికిత్స పొందుతున్న రోగి అకస్మాత్తుగా కనిపించకుండా పోయినా తమకు సంబంధం లేదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిస్థితి స్విమ్స్‌లో నెలకొంది. స్విమ్స్‌లో డాక్టర్లకే రక్షణ లేదంటూ వారం రోజులుగా జూనియర్ డాక్టర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం మరువక ముందే చికిత్స పొందుతున్న రోగి అదృశ్యం అవడం స్విమ్స్‌లో సెక్యూరిటీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. బాధితుల కథనం మేరకు....అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను చికిత్స కోసం కుటుంబ సభ్యులు మంగళవారం స్విమ్స్‌కు తీసుకువచ్చారు.ఓపీలోని వైద్యులు పరీక్షించి ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని,చికిత్స అందించి ఆ నీటిని తొలగించాలని చెప్పారు. ఇందుకు తక్షణమే అడ్మిట్ కావాల్సి ఉంటుందని డాక్టర్లు చెప్పడంతో సీతారామప్పను ఆయన కుమారుడు విశ్వనాథ్ తన వద్ద ఉన్న రూ. 5 వేలు చెల్లించి అడ్మిట్ చేశారు.శ్రీపద్మావతి భవనంలోని నాలుగో అంతస్థులో ఉన్న ఎంఐసీయూలో అడ్మిషన్‌లో ఉన్న సీతారామప్పను వైద్యు లు మంగళవారం రాత్రి మరోసారి పరీక్షించి బుధవారం చికిత్స చేస్తామని, అప్పటి వరకు వాడమంటూ కొన్ని మందులు రాసిచ్చారు.ఆ మందులు వేసుకొని పడుకున్న సీతారామప్ప మంగళవారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం ఒకసారి లేవడంతో విశ్వనాథ్ తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చి పడుకోబెట్టాడు.విశ్వనాథ్ కూడా ఆ పక్కనే నిద్రకు ఉపక్రమించాడు. తిరిగి రెండు గంటల సమయంలో విశ్వనాథ్ లేచి చూడగా పడకపై సీతారామప్ప కనిపించలేదు. దీంతో కంగారు పడిన విశ్వనాథ్ ఆ భవనం అంతా వెతికినా తండ్రి కనిపించకపోవడంతో సెక్యూరిటీ సిబ్బందికి విషయం చెప్పాడు.వారేమాత్రం పట్టించుకోకుండా ఇక్కడే ఎక్క డో ఉంటాడులే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తెల్లవారుజాము వరకు వెతుకుతూనే ఉన్నాడు. బుధవారం మరోసారి స్విమ్స్ ఆవరణ మొత్తం వెతికినా ఫలితం లేకపోవడంతో చివరకు విషయాన్ని స్విమ్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో ఉద యం 10 గంటల సమయంలో ఎంఐసీయూ వార్డుకు వచ్చిన స్విమ్స్ అధికారులు విచారణ చేపట్టారు. రోగిని భద్రంగా చూసుకోకుండా ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని విశ్వనాథ్‌నే మందలించారు.మీరు చెల్లించాల్సిన నగదు బ్యాలెన్స్ చెల్లించాలని ఒత్తిడి చేశారు. తన తండ్రి ఆచూకీ తెలిశాకే నగదు పూర్తిగా చెల్లిస్తానని విశ్వనాథ్ అధికారులకు తెగేసి చెప్పాడు.ఎంఐసీయూలో ఉన్న తన తండ్రి బయటకు వచ్చే అవకాశం లేదని కనీసం ఆయన మెట్లు కూడా దిగలేడని ఎంత చెప్పినా వారు వినిపించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చేసేదేమీలేక బుధవారం మధ్యాహ్నం వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి ఆరోగ్య పరిస్థితి మాత్రమే బాగాలేదని, మానసిక పరిస్థితి బాగానే ఉందని ఇలా ఆయన చెప్పకుండా ఒక్కడే ఎక్కడకూ వెళ్లడని పేర్కొన్నాడు.అయిన వారిని వైద్యం కోసం తీసుకువచ్చే సహాయకులను కనీసం వార్డుల్లోకి కాదు కదా భవనంలోకి కూడా అనుమతించకుండా స్విమ్స్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, దీంతో భవనం బయటే రాత్రిళ్లు సహాయకులు ఇబ్బంది పడుతూ ఉండాల్సి వస్తోందని తెలిపాడు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.32 కోట్లు

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.32కోట్లు లభించింది. సోమవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.32 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 71,153 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 25,863 మంది భక్తులు శ్రీవారికి తల నీలాలు సమర్పించారు.

చిరుధాన్య పంటలపై రైతులకు అవగాహన



రైతులకు సజ్జ సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తిరుపతిరూరల్, ఆగస్టు28: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధన స్థానంలో చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం చిరుధాన్య పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన రైతులు హాజరైన ఈ సదస్సులో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ..సాగుయాజమాన్య పద్ధతులు, చిరుధాన్యాల ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలు, విలువ జోడింపు, పోషక విలువలు వంటి వాటిని వివరించారు. కాగా పంటలసాగులో రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తెచ్చి, పరిష్కారానికి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎన్వీ సరళ, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బి.సంధ్యారాణి, శాస్త్రవేత్తలు వసంత, శ్రీవల్లిదేవి, కేఆర్ ఠాగూర్, నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో ఇంటిముందు రోడ్డు ఆక్రమణ



ఇంటిముందు రోడ్డు ఆక్రమించి పూలకుండీల ఏర్పాటు

తిరుపతి రూరల్, ఆగస్టు 28: చిగురువాడ పంచాయతీ కొత్తూరులో ఓ వ్యక్తి తన ఇంటి ముందు రోడ్డు ఆక్రమించి మొక్కలు పెట్టి చుట్టూ ముళ్ల కంప అడ్డుగా వేశారు. దీంతో ఈ మార్గంలో ద్విచక్రవాహనాలు తప్ప ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోందని గ్రామస్తులు అంటున్నారు. మల్లంగుంట నుంచి కొత్తూరుగ్రామానికి వెళ్లేందుకు 30అడుగుల వెడల్పుతో రోడ్డుమార్గం ఉంది. ఈ గ్రామానికి చెందిన దాదాపు 10 అడుగులకుపైగా రోడ్డు స్థలాన్ని ఆక్రమించి పూల కుండీలను ఏర్పాటు చేసుకున్నారు. గతప్రభుత్వంలో తన ఇంటిముందు సైడు కాలువ కూడా వేయనీకుండా అడ్డుకున్నారని అంటున్నారు. ఈమార్గంలో వాహనాలు ఎలా వెళ్లాలని ఎవరైనా గ్రామస్తులు ప్రశ్నిస్తే గొడవకు వస్తున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

టీటీడీకి విరాళంగా ఆటోక్లినిక్ వాహనం



తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): టీటీడీకి బుధవారం ఓ ఆటోక్లినిక్ వాహనం విరాళంగా అందింది. చెన్నైకు చెందిన ట్రేటికొ ఇంజనీరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ కార్తీక్ టీటీడీకి చెందిన లారీ చేసేస్‌కు రూ.8 లక్షల విలువైన బాడీపిట్ చేసి బుధవారం ఉదయం అందజేశారు. ఈమేరకు లారీ రికార్డులను తిరుమల శ్రీవారి ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరికి అందించారు. అంతకుముందు వాహనానికి పూలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ రవాణా విభాగం జీఎం శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు





పట్నం మహేందర్‌రెడ్డి - అన్బుమణి రాందాస్

తిరుమల,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ మాజీమంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, తమిళనాడు ఎంపీ అన్బుమణి రాందాస్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



చంద్రగిరి, ఆగస్టు 28: చంద్రగిరి మండలం పనబాకం పంచాయతీ అరిగిల వారిపల్లెలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మూడవరోజున బుధవారం సాయంత్రం గ్రామపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రతి కుటుంబం పూజా సామగ్రితో పూజలో పాల్గొన్నారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనావళి గాత్ర కచేరి కావించారు. కోలాటాలు, భజనలు ఏర్పాటు చేయగాగ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తిరుమల రెవెన్యూ డిప్యూటీఈవోగా వెంకటేశ్వర్లు

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్న కె.వెంకటేశ్వర్లు టీటీడీ తిరుమల పంచాయతీ, రెవెన్యూ డిప్యూటీఈవోగా నియమితులయ్యారు. ఆస్థానంలో ఉన్న విజయలక్ష్మిని టీటీడీ పరకామణి, మ్యూజియం డిప్యూటీఈవోగా బదిలీ చేశారు. ఈక్రమంలో వెంకటేశ్వర్లు బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది, తిరుమల స్థానికులు వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సుమన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సుమన్

రేణిగుంట, ఆగస్టు 28: ప్రముఖ సినీనటుడు సుమన్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తిరుపతి సమీపంలోని కరకంబాడిలో గల మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వగృహంలో అమరరాజా వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అమరరాజా సంస్థ ఉద్యోగులు, సుమన్ అభిమానులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో...

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28: సినీ నటుడు సుమన్ జన్మదిన వేడుకలు ఎస్వీయూలో ఘనంగా నిర్వహించారు. సుమన్ అభిమాన సంఘం అధ్యక్షులు నారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సురేంద్ర నాయుడు, మాధవ్, నారాయణస్వామి, గౌస్, వెంకటాద్రియాదవ్, పురుషోత్తం గౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నివారణ



మాట్లాడుతున్న గైనకాలజిస్టు మాధవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28: హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించవచ్చని స్విమ్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి అన్నారు. పద్మావతి వర్సిటీ ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మన దేశంలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక మహిళ సర్వైకల్ క్యాన్సర్‌తో మృతి చెందుతున్నారని తెలిపారు. దీనికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ సరైన నివారణకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ కాత్యాయని, వర్సిటీ మెడికల్ కన్సల్టెంట్ డాక్టర్ పద్మావతి, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ కష్టాలు



గుంతలో ఇరుక్కున్న ఆర్టీసీ బస్సు

- పైపులైను పగిలిన చోట ఏర్పడిన పెద్దగుంత
- ఆర్‌సీ పురంలో ప్రయాణికుల ఇక్కట్లు

రామచంద్రాపురం, ఆగస్టు 28: మండల కేంద్రం రామచంద్రాపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. తాగునీటి పైపలైను పగిలి ఇదే రోడ్డుపై పెద్దగుంత ఏర్పడింది. ఇక్కడ వాహనాలు ఇరుక్కుని ప్రయాణికులు నానా తిప్పలుపడుతున్నారు. 20రోజులుగా తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారి ఆర్‌సీపురంలో అర కిలోమీటరు దూరం సీసీరోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దూరప్రాంతాలకు వెళ్లేందుకు వేరే మార్గం లేకపోవడంతో ఉన్న రోడ్డుపై అర్ధభాగంగా ఒక అడుగు ఎత్తు సిమెంటు రోడ్డు వేసి గట్టి పడటానికి నీటి నిల్వ చేశారు. మిగిలిన పది అడుగుల రోడ్డులో రాకపోకలు సాగుతున్నాయి. ఇక్కడ దారి మధ్యలో తాగునీటి పైపులైను పగిలిపోయి నీరు వస్తుండటంతో పెద్ద గుంత ఏర్పడింది. భారీ వాహన రాకపోకలతో గుంత ఉన్న చోట రోడ్డు ఐదుమీటర్ల దూరం కోతకు గురైంది. తరచూ వాహనాలు ఇక్కడ ఇరుక్కుని పోతున్నాయి. ఒకేదారిలో రాకపోకలు సాగుతుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలకు దారి లేకుండా భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. పెద్దగుంత ఏర్పడిన చోట పైపులైను లీకేజీ అరికట్టి కంకర వేస్తే పరిస్థితి కొంత మెరుగు పడుతుంది. ఈ రోడ్డుపై వచ్చే వాహనాలను అటుఇటు కొంత సేపు ఆపి తరలిస్తే ప్రయాణం సులభతరం అవుతుంది. బుధవారం ఎదురుగా వచ్చే లారీని తప్పించ బోయిన స్కూటరిస్టు బోల్తా పడి తృటిలో ప్రాణాపాయం తప్పింది. పైపులైను లీకేజీ అరికట్టాలని పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పోలీసులు ఏ మాత్రం భావించకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నానా తిప్పలు పడుతున్నారు. ఆయా శాఖ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



భారీగా నిలిచిపోయిన వాహనాలు



గుంత వద్ద ఇరుక్కుపోయిన ట్రాక్టర్

కాలువలో అక్రమ నిర్మాణాలకు రాచబాట





కాలువలో నిర్మించిన రేకుల షెడ్లకు వేసిన సీసీ రోడ్డు - కాలువ స్థలంలో చేపడుతున్న నూతన నిర్మాణం

తిరుపతి రూరల్, ఆగస్టు 28:పేరూరు పంచాయతీ పరిధిలో సర్వేనెంబరు 530/1లోని కాలువ పోరంబోకులో గత వైసీపీ పాలనలో చేపట్టిన అక్రమ నిర్మాణాలకు దర్జాగా తుడా నిధులతో సీసీరోడ్డు వేయడం కొంత ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్వీ వ్యవసాయ కళాశాల గేటు ఎదురుగా హరిపురంకాలనీలో ఉన్న విలువైన కాలువపోరంబోకు స్థలంలో ఆక్రమణదారులు కొన్ని రేకులషెడ్లను నిర్మించారు. స్థానిక పంచాయతీ అధికారుల అనుమతితో ఈనిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్లను కూడా తీసుకున్నారు. కాలువ స్థలంలో నిర్మించినవి అక్రమ నిర్మాణాలని తెలిసికూడా వాటికోసమే ప్రత్యేకంగా స్థానిక వైసీపీ పాలకులు సిమెంటురోడ్డు నిర్మించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. అయితే ప్రభుత్వం మారాక కూడా ఈస్థలంలో ఆక్రమణదారులు గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణాలు చేపడుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించడంలేదు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కాలువభూమిని పరిరక్షించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. సీసీరోడ్డు విషయమై సర్పంచ్ దామినేటి కేశవులును వివరణ కోరగా గ్రామ ప్రజల వినతి మేరకు తుడా నిధులతో రోడ్డు నిర్మించామని తెలిపారు.

తిరుచానూరులో ఘనంగా ఉట్లోత్సవం





స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు - అమ్మవారి ఆలయం వద్ద ఉట్లోత్సవం

తిరుచానూరు, ఆగస్టు 28: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆలయంలో గోకులాష్టమి సందర్భంగా బుధవారం సాయంత్రం వేడుకగా ఉట్లోత్సవం జరిగింది. ఇందులో భాగంగా మధ్యాహ్నం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవ జరిగింది. 6గంటలకు శ్రీకృష్ణస్వామి ఊరేగింపు సందర్భంగా ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్‌లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంటలసాగు ద్వారా స్థూల జాతీయోత్పత్తి పెంపునకు కృషి

- వ్యవసాయశాఖ ప్రత్యేకప్రధానకార్యదర్శి రాజశేఖర్



తిరుపతి రూరల్, ఆగస్టు 28: వ్యవసాయరంగంలో ప్రధానపంటల సాగు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువజోడింపు, విదేశాలకు ఎగుమతుల ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పతిని పెంచేందుకు కృషి చేయాలని వ్యవసాయశాఖ రాష్ట్ర ప్రత్యేక ప్రధానకార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో వికసిత్ ఆంధ్రా-2047 అనే అంశంపై అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు, ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ శాస్త్రవేత్తలకు బుధవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి, ప్రధానపంటలలో అధిక దిగుబడి సాధించేందుకు చేపట్టాల్సిన మెరుగైన నూతన విధానాలు, మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ప్రధాన పంటలసాగు వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. పంటల ఉత్పాదకత పెంపు, రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, విజన్ ఆంధ్రా-2047లో నిర్ణయించిన లక్ష్యాలను చేరుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రధానపంటల సాగు, విస్తీర్ణం, దిగుబడులు పెంచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. వ్యవసాయ సాగులో రైతుల ఆదాయం పెంపుతోపాటుగా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పతిని పెంచేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లాల వరకు చేపట్టాల్సిన కార్యాచరణపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ వర్సిటీ విస్తరణ విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ప్రమీలారాణి మాట్లాడుతూ వర్సిటీలో పరిశోధన, విస్తరణ విభాగాల ద్వారా లక్ష్యాలను చేరుకునేందుకు కొత్త పరిశోధనలు చేపట్టాలని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ మెరుగైన పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన పంటల సాగుని వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ కె.నిర్మల్ రవికుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తుల ట్రేడింగ్, విదేశాలకు ఎగుమతి ద్వారా స్థూల దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. పంట కోతల అనంతరం చేపట్టాల్సిన నూతన సాంకేతికత, ప్రాసెసింగ్, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపువంటి అంశాలను విశదీకరించారు. కాగా తమ తమ జిల్లాలో ఉన్న పంటల సరళిని 26 జిల్లాలకు చెందిన వ్యవసాయాధికారులు వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి జి.ధనుంజయ రెడ్డి, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి: ఎంపీఈఓలు

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వ్యవసాయ శాఖ ఎంపీఈఓలు ఆ శాఖ రాష్ట్ర ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజశేఖర్‌బాబుకు, కమిషనర్ డిల్లీరావుకు ఈ సందర్భంగా విన్నవించారు.ఎంపీఈఓలు మాట్లాడుతూ.. తొమ్మిది సంవత్సరాలుగా వ్యవసాయశాఖలో పనిచేస్తున్నా తమకు ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. ఇందుకు స్పందించిన ఉన్నతాధికారులు త్వరలోనే ఎంపీఈఓల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆర్పీఎఫ్ స్ఫూర్తితోనే ఇప్పటికీ విధులు

డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28: ఆర్పీఎఫ్ స్ఫూర్తితోనే తాను ఇప్పటికీ విధులు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. ఆర్పీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం తిరుపతిలో నిర్వహించారు. కోదండరామిరెడ్డి మాట్లాడుతూ.. తాను తొలుత ఆర్పీఎఫ్ ఎస్ఐగా పని చేశానన్నారు. డిప్యూటీ కలెక్టర్ అయినా తన మూలాలను ఎప్పుడూ మరవలేదని చెప్పారు. రైల్వే స్థలంలో ఆక్రమణల తొలగింపు సందర్భంగా అన్ని శాఖలను సమన్వయం చేసుకొని ఎస్ఐగా సంతృప్తికరంగా విధులు నిర్వహించానని గుర్తు చేసుకున్నారు. ఆర్పీఎఫ్ తిరుపతి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఆర్పీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, మనోహరం, నాయకులు హఫీజ్ ఖాన్, కనకరావు, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రామాయణంపై విశేష పరిశోధనాపత్రాలు రూపొందించండి

- సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి



తిరుపతిరూరల్, ఆగస్టు 28: రామాయణంలోని వివిధ అంశాలపై విశేష పరిశోధనా పత్రాలను రూపొందించాలని తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో బుధవారం అకడమిక్-భవిష్యత్ ప్రణాళికలపై అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విజయనగరానికి చెందిన శ్రీనారాయణం నాగేశ్వరరావు ట్రస్ట్, ఎస్‌సీఎస్ చారిటబుల్‌ట్రస్ట్ అభ్యర్థన మేరకు వచ్చేనెల 26నుంచి 29వరకు రామాయణ జాతీయ సదస్సు జరగనుందని, ఈ సదస్సుకు వర్సిటీ తరపున 30మంది ఫ్యాకల్టీని డిప్యూట్ చేసినట్లు వివరించారు. ఈసదస్సుకోసం విశేష పరిశోధనాపత్రాలను సిద్ధం చేయాలని అధ్యాపకులను కోరారు. సంస్కృతభాషాభివృద్ధికి వర్సిటీ ద్వారా సంస్థల దత్తత, ఆయా సంస్థలకు అనుబంధ, విధివిధానాలు రూపొందించడంపై అధ్యాపకులతో చర్చించారు. వర్సిటీలోని పలువిభాగాల్లో అధ్యాపకుల కొరతను గుర్తించి అతిథి ఫ్యాకల్టీ నియామకానికి చర్యలు చేపట్టామని వివరించారు. హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26మందికి జరిమానా

తిరుపతి(లీగల్), ఆగస్టు 28: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 26మంది నిందితులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. అలాగే వీరిలో అధికమోతాదులో మద్యం సేవించిన 9మంది ద్విచక్ర వాహనదారులకు రెండు రోజులు, కారుడ్రైవర్ల ఇద్దరికి మూడు రోజులు జైలు శిక్షవిధిస్తూ తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును ఎస్పీ సుబ్బరాయుడు ప్రశంసించారు.

సిఫార్సు లేఖలు

పనిచేస్తాయా?

- అనుకూల స్థానాల్లో పోస్టింగులకు ఉద్యోగుల పాట్లు
- మరో రెండు రోజుల్లో పూర్తికానున్న బదిలీలు

సిఫార్సు లేఖలు పనిచేస్తాయా? అనుకూల ప్రాంతాల్లో పోస్టింగులు వస్తాయా? ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల మధ్య సాగుతున్న చర్చ ఇది. గత నెలలో తహసీల్దార్ల బదిలీల కోసం ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చినా.. చాలావరకు పని జరగకపోవడాన్ని వారు గుర్తుచేసుకుంటున్నారు.

మరోవైపు మ్యూచువల్ ఉంటేనే బదిలీలకు ఆమోదించాలని కలెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో తమకు ఎవరైనా మ్యూచువల్ వస్తారా అని మరికొందరు ఉద్యోగులు ఆరా తీసే పనిలో పడ్డారు.

- చిత్తూరు రూరల్



వివిధ శాఖల్లో బదిలీల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ నెల 31వ తేదీకంతా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. సెప్టెంబరు ఒకటో తేదికి బదిలీ అయిన స్థానాల్లో ఉద్యోగులు బాధ్యతలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అందుకు అనుగుణంగా అధికారులు బదిలీల ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఇక, వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలను ఆపాలంటూ ఏపీ కమర్షియల్ ట్యాక్స్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో 2.0 పునర్వ్యవస్థీకరణ పేరిట జరిగిన తప్పిదాలపై విచారణ చేపట్టి, వాటిని సరిదిద్దాకే బదిలీలు చేపట్టాలని కోరుతున్నారు. గత 5 సంవత్సరాలలో వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని, కమర్షియల్ ట్యాక్స్‌లో ఉన్నతాధికారుల అవినీతిపై ఏసీబీ దర్యాప్తు చేయాలని డిమాండు చేస్తున్నారు. అవేవీ పట్టించుకోకుండా ఆ శాఖ అధికారులు బదిలీల ప్రక్రియను చేపడుతున్నారు. ఈ నెల 31వ తేది లోపు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గతేడాదే అధిక శాతం ఉద్యోగులు బదిలీ అయ్యారు. దీంతో ఇప్పుడు నోడల్ డివిజన్ పరిధిలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల నుంచి సుమారు 120 మంది మాత్రమే బదిలీ అయ్యే అవకాశం ఉంటుందంటున్నారు.

జడ్పీలో వేగంగా బదిలీల ప్రక్రియ

జడ్పీలో ఎంపీడీవోల బదిలీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. గురువారానికి దరఖాస్తుల పరిశీలన కూడా పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. జడ్పీ పరిధిలో ఎంపీడీవోల నుంచి అటెండర్ వరకు వివిధ క్యాడర్లకు సంబంధించి 575 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఐదేళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న 297 మందికి బదిలీలు అనివార్యమైంది. ఐదేళ్ల పూర్తి కాని వారు కూడా వివిధ స్థానాలకు బదిలీ కావాలని ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో దరఖాస్తు చేసుకున్నారు.

విద్యుత్ శాఖలో 72 మందికి తప్పనిసరి

సదరన్ డిస్కం పరిధిలో బదిలీ ప్రక్రియపై కసరత్తు కొనసాగుతోంది. ఈ నెల 31వ తేదిలోపు బదిలీలు పూర్తి చేయాల్సి ఉంది. ఉద్యోగులు కూడా తమకు కావాల్సిన చోటు బదిలీ చేయించుకునేందుకు ఎమ్మెల్యే, ఎంపీల నుంచి సిఫార్సు లేఖలతో దరఖాస్తులు చేశారు. డిస్కం పరిధిలో వివిధ హోదాలలో 72 మంది ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. వీరికి బదిలీ తప్పడం లేదు. 5 ఏళ్ల పూర్తి చేసుకున్న వారిలో ఎస్ఈ, జీఎంలు ముగ్గురు, ఈఈలు 14, డీఈలు 24, ఏఈలు 18, సీజీఎంలు 2, ఏఏవోలు 12 మంది ఉన్నారు.

గ్రామ సచివాలయాల్లో నాలుగు శాఖలకు మినహాయింపు

మొదట్లో గ్రామసచివాలయాల్లో పనిచేస్తున్న అనిమల్ హస్బెండరీ, అగ్రికల్చర్, సిరికల్చర్, ఏఎన్ఎంలను ఆయా శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం చూసింది. అయితే బుధవారం వీరికి బదిలీల్లో మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ శాఖలో వీరి బదిలీల ప్రక్రియను నిలిపివేశారు.

వెల్లుల్లి ....మరీ ఘాటు

కిలో రూ.280 నుంచి రూ.360కి పెరుగుదల



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28: వెల్లుల్లి మరీ ఘాటెక్కింది. దిగుబడి తగ్గిపోవడమే ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్నూలు, ముళబాగల్, ధార్వాడ ప్రాంతాల్లో వెల్లుల్లిని ఎక్కువగా పండిస్తారు.విపరీతమైన వర్షాలు రావడం, గడ్డలు కుళ్ళిపోవడంతో దిగుబడి తగ్గి ధరలు అనూహ్యంగా పెరిగాయి. రెండు నెలల క్రితం వరకూ తిరుపతి మార్కెట్‌కు రోజుకు 50 టన్నుల వరకు వెల్లుల్లి వచ్చేది. గుజరాత్ నుంచి 70 శాతం దిగుమతి చేసుకునే వారు. అక్కడ కూడా వెల్లుల్లి పంట ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రస్తుతం తిరుపతి మార్కెట్‌కు 25 టన్నులు మాత్రమే వస్తుండడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.రెండు నెలల క్రితం కిలో రూ.200 వరకు పలికిన వెల్లుల్లి రెండు వారాలుగా మరో రూ.80పెరిగింది. ప్రస్తుతం అరకిలో వెల్లుల్లి రూ.180కి చేరుకుంది.దిగుబడులు ఇలాగే వుంటే రెండు మూడు వారాల్లో కిలో రూ.500కు వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

సేఫ్టీ ఆడిట్‌లో గుర్తించిన భద్రతా లోపాలను సరిచేసుకోండి

● పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్, ఎస్పీ సూచన



పరిశ్రమల ప్రతిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(విద్య), ఆగస్టు 28: సేఫ్టీ ఆడిట్‌లో గుర్తించిన భద్రతా లోపాలను పరిశ్రమల యజమానులు సరిచేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్, ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమలకు పెద్దపీట వేయడంతో పాటు కార్మికుల భద్రతకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇటీవల జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదవశాత్తు ముగ్గురు మరణించారని, పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త వహించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. ఆమేరకు ఈసమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పారిశ్రామికవేత్తలకు సుహృద్భావ వాతావరణం కల్పిస్తూ పరిశ్రమల విస్తరణకు పెద్దపీట వేస్తున్నామని, కార్మికుల భద్రత కూడా తమకు అత్యంత ప్రధానమని ముఖ్యమంత్రి వెల్లడించారని వారికి వివరించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, అజాగ్రత్త ఎంతమాత్రం కూడదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో జిల్లా యంత్రాంగానికి వెంటనే సమాచారం అందినప్పుడే తగుచర్యలు తీసుకునేందుకు, నష్టాన్ని నివారించేందుకు వీలౌతుందని చెప్పారు. జిల్లాలో అత్యంత ప్రమాదకర (ఎంఏహెచ్-ఏ) కేటగిరీ పరిశ్రమలు 12, ఎంఏహెచ్-బీ1, బీ2 కేటగిరీల్లో 107 పరిశ్రమలు ఉన్నాయని, భద్రతా ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. సేఫ్టీ ఆడిట్ జరిగిందనే విషయం స్పష్టంగా కనబడేలా ప్రతి పరిశ్రమవద్ద డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని సూచించారు. కార్మికులకు ఎప్పటికప్పుడు విధులకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి పరిశ్రమలో రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఫైర్ మాక్‌డ్రిల్ చేయాలని సూచించారు. ఆరు నెలలకోకసారి ఆన్‌సైట్ ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించాలని చెప్పారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ... తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, విపత్కర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ ప్లాన్ సిద్ధంగా ఉండాలన్నారు. ఎంట్రీ, ఎగ్జిట్, హాస్పిటల్, ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన ప్రణాళికలు పక్కాగా ఉండాలని చెప్పారు. ప్రమాదకర పరిశ్రమల్లో సెక్యూరిటీ ప్లాన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ బ్లూ ప్రింట్‌ను రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, పీసీబీ అధికారి మదన్‌గోపాల్, జిల్లా అగ్నిమాపశాఖ అధికారి రమణయ్య, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాదరావు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి అధికారి రామ్మూర్తి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, పీసీబీ ఏఈ మదన్ మోహన్, అమరరాజ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీల ఎంపిక

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 28: ఏపీ ట్రాన్స్‌కో పరిధిలో రాజమండ్రిలో జరుగనున్న ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలకు సంబంధించి తిరుపతి సర్కిల్ వాలీబాల్ జట్టు ఎంపిక ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో జరుగుతోందని విద్యుత్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరి వి.లీలారామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యాయం జరుగనున్న పోటీల్లో జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులు కూడా పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు. రాజమండ్రిలో సెప్టెంబరు 10 నుంచి 12వ తేదీ వరకు ఇంటర్ సర్కిల్ పోటీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ ఉద్యోగులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28: గంజాయి రవాణా కేసులో తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం రాత్రి ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు.... ఐదుగురు స్నేహితులు ఓ ముఠాగా ఏర్పడి విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.రేణిగుంట చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్యాకెట్ రూ.200 లెక్కన విక్రయిస్తున్నారని తెలియడంతో పోలీసులు కాపుకాశారు.విక్రయించడానికి తీసుకెళుతున్న దాదాపు రూ.60,000 విలువ చేసే నాలుగు కిలోల గంజాయిని రేణిగుంట రోడ్డులోని హీరో షోరూము వద్ద పట్టుకున్నారు.తిరుపతిలోని బొమ్మగుంటకు చెందిన సాయిభానును, కొర్లగుంటకు చెందిన మొక్కల భరత్‌కుమార్ రెడ్డిని, ఎస్ఆర్ పురం మండలం కొండేపల్లికి చెందిన ఈశ్వర రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసులో నిందితులైన మరో ఇద్దరు పరారీలో వున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడదాం

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయని, దీనిని వ్యతిరేకించడానికి ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 2000 ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని చేసిన పోరాటంపై కాల్పులు జరిపి రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలను పొట్టన పెట్టుకున్న ఘనత మన ముఖ్యమంత్రికి ఉందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు అమర్చడానికి పాలక ప్రభుత్వం ప్రయత్నాలు పునఃప్రారంభించిందన్నారు. దీంతో రైతులు, ప్రజలపై అదనపు విద్యుత్ భారం పడుతోందని తెలిపారు. దీనిని అడ్డుకోవడానికి ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

తిరుపతి రేషన్‌షాపు డీలర్ల నూతన కార్యవర్గం



చంద్రశేఖర్‌రెడ్డి - పుష్పాంజలి - గిరిజ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 28: తిరుపతి నగర రేషన్‌షాపు డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం జిల్లా అధ్యక్షుడు సీవీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సి.చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎ.గిరిబాబు, ప్రధాన కార్యదర్శిగా బి.పుష్పాంజలి, కార్యదర్శిగా డి.కిషోర్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్.శ్రీనాథ్, సహాయ కార్యదర్శిగా ఎం.ప్రమీలమ్మ, ఉప కార్యదర్శిగా బి.రామకృష్ణ నాయక్, ముఖ్య సలహాదారుగా డి.నగేష్, కార్యవర్గ సభ్యులుగా కె.కవిత, పి.సందీప్, జి.వి.లక్ష్మి, ఎం.తాతారావు, ఎ.రజియాబేగం, మిత్రకుమారి, వై.చరణ్ ప్రసాద్, జి.రాజశేఖర్‌రెడ్డి, టి.విజయ, పి.రాధ, ఎం.పవన్ యాదవ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెంకటేష్ ప్రకటించారు.

అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు పెంపొందించుకోవాలి

ఎకనమిక్స్ జాతీయ సదస్సులో వక్తల మనోభావం



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అమృతలింగం తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఆగస్టు 28: అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను పెంపొందించుకోవడం ద్వారా ఆయా దేశాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని శ్రీలంకలోని కొలంబో యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.అమృతలింగం అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ ద సస్టైనబుల్ డెవెలప్‌మెంట్ ఛాలెంజెస్ అంశంపై ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీలు సంయుక్తంగా బుధవారం జాతీయ సదస్సు చేపట్టాయి. పద్మావతి వర్సిటీ సావేరి హాల్లో చేపట్టిన ప్రారంభ సభలో ప్రొఫెసర్ అమృతలింగం కీలకోపన్యాసం చేశారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను పెంపొందించుకునే సందర్భంలో శ్రీలంక విఫలమైందన్నారు. భారతదేశంతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను పెంచుకోవడం ద్వారా శ్రీలంకకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల ద్వారానే ఒక దేశపు జాతీయ ఆదాయంలో స్థిరమైన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన లక్ష్య సాధనకు ప్రతి దేశం సహకారాన్ని అందించాలని కోరారు. ఆర్థిక శాస్త్ర విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని సూచించారు. పద్మావతి వర్సిటీ డీన్ కిరణ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. కరోనా, యుద్ధ సమయంలో వివిధ రాష్ట్రాలు, దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో శాంతి, సామరస్యం సాధించాలంటే దేశాల మధ్య సత్సంబంధాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత, పలు ప్రాంతాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవాణి ట్రస్టు నిధులతో కల్యాణ మండపాలు నిర్మించాలి



మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, ఆగస్టు 28: టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులతో మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థం తిరుపతిలోని టీటీడీ, మఠం స్థలాల్లో కల్యాణ మండపాలు నిర్మించాలని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ కోరారు. బుధవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతమున్న కల్యాణ మండపాలు సంపన్నులకే అందుబాటులో ఉంటున్నాయని, మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దేశంలో టీటీడీకి సంబంధించిన కల్యాణ మండపాలను కూడా ఆధునికీకరించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వివరిస్తానన్నారు. టీటీడీలో ప్రక్షాళన ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన మొత్తం రూ.1,550 కోట్ల నిధులలో రూ.350కోట్లు ఆలయాల నిర్మాణం పేరుతో పక్కదారి పట్టించారని ఆరోపించారు. అందుకు కారణమైన అరుగురికి రాష్ట్ర విజిలెన్స్ ఇప్పటికే నోటీసులు ఇచ్చిందని, త్వరలో మరింత మందికి నోటీసులు అందనున్నాయని చెప్పారు. అందుకు సంబంధించిన ఫైల్స్‌ను కూడా దగ్ధం చేయడం దారుణమన్నారు.

నేటి నుంచి ప్రజారోగ్య, సామాజిక శాస్త్ర సంఘాల సంయుక్త సమావేశాలు



మాట్లాడుతున్న వైద్యులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 28: భారత ప్రజారోగ్య, ఆంధ్రప్రదేశ్ సామాజిక శాస్త్ర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్వీ వైద్యకళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతశ్రీగిరి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంయుక్త సమావేశంలో ఏకీకృత ఆరోగ్యం, మానవాళి, జంతుజాల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పునరాగమ వ్యాధులు, పౌష్టికాహార ప్రాధాన్యం, పెద్దలకు వ్యాధి నిరోధక టీకాలు వంటి అంశాలపై చర్చాగోష్ఠి ఉంటుందన్నారు. వైద్య ఆరోగ్యరంగంలో సంక్రమిత వ్యాధుల నూతన పోకడలు, నివారణ, నియంత్రణ, ఏకీకృత ఆరోగ్యం, భావన ఆవశ్యకత గురించి ప్రతినిధులకు ఈ సమావేశంలో అవగాహన కల్పించనున్నట్లు వారు తెలిపారు. ముఖ్యఅతిథిగా వైద్యశాస్త్ర సంచాలకులు డాక్టర్ నరసింహన్ హాజరవుతారని చెప్పారు. పీఆర్వో వీరకిరణ్, డాక్టర్ యుగంధర్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని అడ్డుకుందాం

కందారపు మురళి



విద్యుత్ పోరాట అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 28: రాష్ట్రంలో ప్రజలపై విద్యుత్ ఛార్జీలు పరోక్షంగా పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు అడ్డుకోవాలని సీపీఎం నేత కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. యశోదానగర్‌లోని సీపీఎం కార్యాలయంలో బుధవారం విద్యుత్ ఛార్జీల పోరాట అమర వీరుల చిత్ర పటాలకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ముఖ్యమంత్రి విద్యుత్ ఛార్జీలు తిరిగి పెంచడానికి, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజాపోరాటాల ద్వారా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. జయచంద్ర, సాయిలక్ష్మి, మాధవ్, ఆర్.లక్ష్మి, హేమలత, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సాకం నాగరాజకు నేడు వేమన సాహితీ పురస్కార ప్రదానం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 28: తిరుపతికి చెందిన తెలుగుభాషావేత్త, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ సాకం నాగరాజకు వేమన సాహితీ పురస్కార ప్రదానోత్సవ సభ బుధవారం జరగనుంది. వేమన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక యశోదానగర్‌లోని కార్యాలయంలో సాయంత్రం ఐదు గంటలకు సభ జరుగుతుంది. ఈ కార్యక్రమానికి తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం అధ్యక్షత వహిస్తారు. ఎస్వీయూ ప్రాచ్యపరిశోధన సంస్థ సంచాలకులు ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు, జె.దుర్గాప్రసాద్ (రాజాచంద్ర ఫౌండేషన్), మట్టా పురుషోత్తంరెడ్డి(న్యాయవాది), మల్లారపు నాగార్జున తదితరులు పాల్గొంటారు.

రేపు కపిలతీర్థంలో లక్ష కుంకుమార్చన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 28: తిరుపతిలోని కపిలేశ్వరాలయంలో ఆగస్టు 30వ తేదీ, శుక్రవారం కామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు గణపతి పూజ, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలనుంచి రాత్రి 8గంటల వరకు స్వామి, అమ్మవార్ల తిరువీధి ఉత్సవం జరుగుతుంది.


నాయీబ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబు



మాట్లాడుతున్న రుద్రకోటి సదాశివం

తిరుపతి అర్బన్, ఆగస్టు 28:ముఖ్యమంత్రి చంద్రబాబు నాయీబ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులు నింపారని తిరుపతి పార్లమెంట్ టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు రూ.25వేలు కనీస వేతనంగా నిర్ణయించి ఇచ్చిన హామీని నెరవేర్చారని కొనియాడారు. దేవాలయాల పాలకమండళ్లలో సైతం సముచిత గౌరవం కల్పిస్తూ ఒక సభ్యుడిగా అవకాశం కల్పించేలా నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. సమావేశంలో బీసీ నాయకులు విశ్వనాథం, టి.మోహన్, ఆవులపాటి వెంకటరత్నంబాబు, వి.బాలాజీ, నరసింహులు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న రాధాదేవి

టీటీడీ కల్యాణకట్టలో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులకు రూ.20వేల నుంచి రూ.25వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రుణపడి ఉంటామని టీటీడీ మహిళా క్షురకుల వ్యవస్థాపకురాలు, సంఘం అధ్యక్షురాలు కె.రాధాదేవి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన నాయీబ్రాహ్మణుల జీతాల పెంపు హామీని అనతి కాలంలోనే అమలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నాయీబ్రాహ్మణులు అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు సమర్పించారని, వారిరువురి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారని గుర్తు చేశారు. దేవాలయాల పాలకమండలిలలో మహిళలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి ఆవులపాటి బుజ్జిబాబు, శ్రీహరి, ప్రసాద్, రామనారాయణ, గంగాధర్, కమల్, వెంకి, శివ, బాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు



తిరుపతి రూరల్, ఆగస్టు 28: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పనిచేసే కాంట్రాక్ట్, డైలీవేజ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి తగు న్యాయం చేయాలని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు తెలిపారు. వెటర్నరీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 20ఏళ్లుగా వివిధ విభాగాల్లో అనేకమంది కార్మికులు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, పిల్లలచదువులు, కుటుంబపోషణ వంటివి భారంగా మారాయని తెలిపారు. వీరికి గుర్తింపుకార్డులు కూడా ఇవ్వలేదని, విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లేటప్పుడు పోలీసులతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. వర్సిటీ ఉన్నతాధికారవర్గాలు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు. కాగా కార్మికులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ నగర ప్రధానకార్యదర్శి కె.వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు టి.సుబ్రమణ్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హరితాంధ్ర కోసం అడుగేద్దాం : కలెక్టర్



వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి (విద్య), ఆగస్టు 28: ఆంధ్రప్రదేశ్‌ను హరితాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు గాను ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఈనెల 30న నిర్వహించే వనమహోత్సవం-2024 పోస్టర్‌ను జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డితో కలిసి కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హరిత యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా చిన్నా పెద్దా అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అటవీశాఖ అధికారి ధర్మరాజు, ఫారెస్ట్ రేంజ్ అధికారిణి మాధవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ప్రతి అధికారినీ బదిలీ చేయాలి

బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), ఆగస్టు 28: తిరుపతి నగర పాలకసంస్థలో సుదీర్ఘకాలం గా పనిచేస్తున్న ప్రతి అధికారిని బదిలీ చేయాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలు కట్టే ఆస్తి పన్నులను సివిల్ పనుల పేరుతో కొంతమంది అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. నగరపాలకసంస్థ రూల్స్ ప్రకారం ఐదు సంవత్సరాలు దాటిన ప్రతి ఇంజనీర్‌ను బదిలీ చేయాలన్నారు. అలా చేయని పక్షంలో అవినీతి అధికారుల ఆగడాలకు అంతేలేకుండా పోతుందన్నారు. దీంతో ఎన్డీయే కూటమిపై ప్రజల్లో పలుచన అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే పారదర్శకమైన పాలనకు శ్రీకారం చుట్టాలని కోరారు.

ఆత్మస్థైర్యంతో జీవించండి

ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి(నేరవిభాగం),ఆగస్టు28:పదవీ విరమణ పొందిన, విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసులు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా జీవించాలని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు.జిల్లా పోలీసుకార్యాలయంలో బుధవారం విధి నిర్వహణలో అకాల మరణం చెందిన పోలీసు కుటుంబాలు, పదవీవిరమణపొందిన కుటుంబాలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ.. నాడు క్రమశిక్షణతో నడచినవారి పయనమే నేటి తరం పోలీసులకు స్ఫూర్తి అన్నారు. పోలీసు కుటుంబాల క్షేమ సమాచారాలు, సాధకబాధలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు కుటుంబాలకు రావాల్సిన పీఎఫ్, గ్రాట్యుటీ, ఏపీజీఎల్ఐ, ఇన్సూరెన్సు బెనిఫిట్స్ వంటివి సత్వరమే పొందేవిధంగా సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

థాయ్‌లాండ్‌కు పద్మావతి వర్సిటీ ప్రతినిధులు


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28: పద్మావతి మహిళా యూనివర్సిటీకి చెందిన ముగ్గురు ప్రతినిధుల బృందం బుధవారం థాయ్‌లాండ్‌కు పయనమైంది. 29, 30వ తేదీల్లో థాయ్‌లాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సోంఖ్లా యూనివర్సిటీలో పేదరిక నిర్మూలన అంశంపై నిర్వహించే సదస్సులో వీరు పాల్గొంటారు. ఈ బృందంలో పద్మావతి వర్సిటీ రిజిస్ట్రార్ రజని, డీన్ ఉష, టానిక్ సెంటర్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ జ్యోత్స్న ఉన్నారు.

రూ.68.7లక్షలకు వ్యాపారి ఐపీ

తిరుపతి(లీగల్), ఆగస్టు 28: తిరుపతి అక్కారాంపల్లి ఎర్రమిట్టకు చెందిన ఎన్.మురుగ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.68.7లక్షలకు ఐపీ దాఖలు చేశారు. న్యాయవాది ఎన్.మనోహర్ తెలిపిన ఐపీలోని వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఎర్రమిట్టలో మురుగ నితిహాసినిహాట్‌చిప్స్ పేరుతో వ్యాపారాన్ని నిర్వహించాడు. వ్యాపార విస్తరణకు అధిక వడ్డీలకు అప్పులు తీసుకున్నట్లు పిటీషన్‌లో పేర్కొన్నాడు. వ్యాపారంలో పోటీ తీవ్రతను తట్టుకోలేక తీవ్రంగా నష్టపోయాడు. అప్పు ఇచ్చినవారినుంచి ఒత్తిడి అధికం కావడంతో బాధితుడు కోర్టులో ఐపీ దాఖలు చేశారు. ఇందులో 22మందిని ప్రతివాదులుగా చూపించారు.

మునగాకు, చిరుధాన్యాలతో బిస్కెట్లు

పద్మావతి వర్సిటీలో తయారీని పరిశీలించిన మహిళలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28: పద్మావతి యూనివర్సిటీలోని హోం సైన్స్ విభాగంలో మునగాకు, చిరుధాన్యాలతో తయారు చేస్తున్న బిస్కెట్లను వెంకటగిరి ప్రాంతానికి చెందిన 30మంది స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళల బృందం బుధవారం పరిశీలించింది. మైక్రో ఎంటర్‌ప్రైజెస్ డెవెలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా చేపట్టిన 15 రోజుల శిక్షణా కార్యక్రమంలో ఈ సందర్శన ఏర్పాటు చేశారు. తయారీ ప్రక్రియలో వీరికి కల్గిన సందేహాలను వర్సిటీ లైవ్లీ హుడ్ బిజినెస్ ఇన్‌క్యుబేషన్ ఫెసిలిటీ సెంటర్ ప్రతినిధి డాక్టర్ విజయ నివృత్తి చేశారు. అనంతరం అధ్యాపకులతో మహిళలు ముఖాముఖి నిర్వహించారు. చిరుధాన్యాలతో విలువాధారిత ఉత్పత్తుల తయారీ గురించి గ్రామీణ మహిళలు అవగాహన పొందారు.

ఎరువుల అమ్మకాలకు 'సహకారం'



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28: రైతులకు సింగిల్ విండోల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా లైసెన్సు తీసుకోవడం వంటి ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను (సింగిల్ విండోలు) నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఎరువులకోసం అక్కడికి వెళితే ముందుగా డబ్బులు కట్టించుకున్న తర్వాతే ఇచ్చేవారు. ఇక, గత ఐదేళ్ల సింగిల్ విండోల్లో ఎరువులు, విత్తనాల అమ్మకాలు లేకపోవడంతో వాటి లైసెన్సులను పునరుద్ధరించు కోలేదు. జిల్లా సహకారకేంద్ర బ్యాంకు పరిధిలో 37 సింగిల్ విండోలు ఉంటే, వాటిలో 14కు మాత్రమే లైసెన్సులు ఉన్నాయి. దీంతో ఎరువులకోసం ప్రైవేటు డీలర్లపై రైతులు ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. వారు సీజన్‌లో యూరియా, మిశ్రమ ఎరువులను అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి.. సింగిల్ విండోలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంది. విత్తనాలు, ఎరువులు సింగిల్ విండోల ద్వారా రైతులకు అందించాలని నిర్ణయించింది. దీంతో లైసెన్సులు పునరుద్ధరించుకోవాలని విండోల సీఈవోలను సహకార శాఖ అధికారులు ఆదేశించారు. కొత్త లైసెన్సులు తీసుకోవాలన్నా, ఉన్న వాటిని పునరుద్ధరించుకోవాలన్నా నిబంధనలు అడ్డువస్తున్నాయి. లైసెన్సు ఇవ్వాలంటే సింగిల్ విండోల్లో ఉద్యోగి బీఎస్సీ (అగ్రి) లేదా డిప్లొమా చేసుండాలి. ఆ విద్యార్హత లేకుంటే 15 రోజుల డిప్లొమా కోర్సు పూర్తిచేయాలి. దీనికి రూ.15 వేలు ఖర్చవుతుంది. జిల్లాలోని అన్ని సంఘాల్లోనూ ఎరువుల వ్యాపారం ప్రారంభించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. డీసీసీబీ, సహకార, వ్యవసాయ శాఖలు, మార్క్‌ఫెడ్‌ల సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాకారమవ్వడం ఖాయం.

శిక్షణ ఇప్పిస్తాం:డీఎల్‌సీవో వనజ

సింగిల్ విండోల సిబ్బందికి ఎరువుల అమ్మకాలపై వ్యవసాయశాఖ అధికారులతో సంప్రదించి 15రోజుల డిప్లొమా కోర్సులో శిక్షణ ఇప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. వెంటనే అన్ని సింగిల్ విండోలు ఎరువుల అమ్మకాల కోసం వ్యవసాయశాఖ ద్వారా లైసెన్సులు పొందాలని ఆదేశించాం.

అధికారుల్లో బదిలీల హడావుడి

తడ, ఆగస్టు 28: కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రక్రియ కొనసాగుతోంది. అయితే మండలస్థాయిలో అధికారులు తమకు అనువైనచోట పోస్టింగ్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇంచుమించుగా అన్ని శాఖల్లో బదిలీ ప్రక్రియ పూర్తికాగా పంచాయతీరాజ్‌లో నెలాఖరుకు పూర్తికానుంది. దీంతో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల్లో హడావుడి కన్పిస్తోంది. ఏ ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు కలసినా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. దాంతోపాటు స్థానిక నాయకుల అండదండలు, సిఫారస్సుల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మండల పరిధిలోని పంచాయతీరాజ్ అధికారులే కాకుండా గూడూరు నియోజకవర్గంలోని అధికారులు, తడ మండలానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతుండడం గమనార్హం. ఇలా అధికారులు, సిబ్బంది బదిలీల హడావుడితో తిరుగుతుండడంతో సచివాలయాలన్నీ బోసిపోతున్నాయి. మరో రెండు రోజుల్లో ఈ బదిలీల ప్రక్రియ పూర్తికానున్నడంతో అప్పటి వరకు ఈ కార్యాలయాలన్నీ ఇలాగే కన్పించే అవకాశం ఉంది. శుక్ర, శనివారాల్లో నెల్లూరు జిల్లాపరిషత్ కార్యాలయంలో ఈ మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న అధికారులు కౌన్సెలింగ్ హాజరుకావాలంటూ నెల్లూరుజిల్లా పంచాయతీ అధికారి ఎం.సుష్మిత బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28: గంజాయి రవాణా కేసులో తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం రాత్రి ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు... ఐదుగురు స్నేహితులు ఓ ముఠాగా ఏర్పడి విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.రేణిగుంట చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్యాకెట్ రూ.200 లెక్కన విక్రయిస్తున్నారని తెలియడంతో పోలీసులు కాపుకాశారు.విక్రయించడానికి తీసుకెళుతున్న దాదాపు రూ.60,000 విలువ చేసే నాలుగు కిలోల గంజాయిని రేణిగుంట రోడ్డులోని హీరో షోరూము వద్ద పట్టుకున్నారు.తిరుపతిలోని బొమ్మగుంటకు చెందిన సాయిభానును, కొర్లగుంటకు చెందిన మొక్కల భరత్‌కుమార్ రెడ్డిని, ఎస్ఆర్ పురం మండలం కొండేపల్లికి చెందిన ఈశ్వర రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసులో నిందితులైన మరో ఇద్దరు పరారీలో వున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

చిత్తూరు నగరంలో ఇక ఎఫ్‌ఎం రేడియో



చిత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుడ్ మార్నింగ్ హైదరాబాద్.., గుడ్ మార్నింగ్ బెంగుళూరు.. అంటూ మహానగరాల్లో ట్రెండ్ సెట్ చేస్తూ.. ప్రజలను ఎంటర్‌టైన్ చేస్తున్న ఎఫ్‌ఎం రేడియో ఇక చిత్తూరులోనూ ప్రారంభం కానుంది. 'గుడ్ మార్నింగ్ చిత్తూరు..' అంటూ నగర ప్రజలను పలకరించనుంది. దేశవ్యాప్తంగా 234 నగరాల్లో కొత్తగా ఎఫ్‌ఎం రేడియోను ప్రారంభించడానికి బుధవారం కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అందులో చిత్తూరుకూ స్థానం దక్కింది. స్థానిక అంశాలకు ప్రాధాన్యమిస్తూ మాతృభాషలో నడిపేలా రూ.784.87 కోట్లతో అంచనాతో ఈ ప్రైవేటు ఎఫ్‌ఎంలను ప్రారంభించనున్నారు. 234 నగరాల్లో 730 ఛానెళ్లను నిర్వహించనుండగా.. చిత్తూరు కేంద్రంగా పనిచేసే స్టేషన్‌లో మూడు ఛానెళ్లు ఉంటాయి. ఈ నిర్ణయంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలున్నాయి. స్థానిక అంశాలు, భాష, సంస్కృతి మీద అవగాహన ఉన్నవారికి, గాయకులకు మంచి అవకాశాలు లభించనున్నాయి.

రైల్వే జంక్షన్‌లో వసతుల కరువు

- 4,5 ప్లాట్‌ఫాంలపై అరకొరగా షెల్టర్లు
- పడమర వైపు నిరుపయోగంగా టిక్కెట్ కౌంటర్





4, 5 ప్లాట్‌ఫారాల్లో అసంపూర్తిగా ఉన్న షెల్టర్ - పడమర వైపు నిరుపయోగంగా టిక్కెట్ కౌంటర్

గూడూరు, ఆగస్టు 28: స్థానిక రైల్వేస్టేషన్‌లో వసతులు సరిగ్గా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గూడూరు రైల్వే జంక్షన్ కావడంతో ప్రయాణికులు రద్దీ ఎక్కువగా ఉంటుంది. రైల్వేస్టేషన్ మీదుగా విజయవాడ, తిరుపతి, చెన్నైలకు నిత్యం సుమారు 70 ప్యాసింజర్లు, ఎక్స్‌ప్రెస్‌లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. విజయవాడ, చెన్నై నుంచి వచ్చే శ్రీవారి భక్తులు గూడూరు రైల్వేస్టేషన్‌లో దిగి తిరుపతికి వెళ్తుంటారు. దీంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏడాదిన్నర క్రితం కొత్తగా 4,5 ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేశారు. అయితే కొంత వరకు మాత్రమే షెల్టర్లను నిర్మించారు. దీంతో తాము ఎక్కాల్సిన రైళ్లలోని బోగీల వద్ద వేచి ఉండే ప్రయాణికులు ఎండ, వానకు ఇబ్బంది పడుతున్నారు. షెల్టర్ దాటి కోచ్‌లు ఆగిన సమయంలో ప్రయాణికులు పరుగులు తీస్తూ జారిపడిన సంఘటనలున్నాయి. 4,5 ప్లాట్‌ఫాంలపై సరైన మరుగుదొడ్ల సౌకర్యం, వెయిటింగ్ రూం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పడమర వైపు నుంచి వచ్చే ప్రయాణిలకు సౌకర్యవంతంగా ఉండేలా గతంలో నిర్మించిన టిక్కెట్ విక్రయకేంద్రం మూతపడింది. పడమరవైపు నుంచి వచ్చే ప్రయాణికులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా 1వ నెంబరు ప్లాట్‌ఫాంకు చేరుకుని తూర్పువైపు ఉన్న టిక్కెట్ కౌంటర్‌లో టిక్కెట్ కొనుగోలు చేయాల్సి ఉంది. ప్లాట్‌ఫాంలు దాటేందుకు ఉత్తరం వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లిఫ్ట్ సౌకర్యం ఉంది. అదేవిధంగా దక్షిణం వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జికి కూడా లిఫ్ట్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. రైల్వేస్టేషన్ ఆవరణలో ఏటీఎం సెంటర్, పార్కింగ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకునేందుకు కౌంటర్‌కు వచ్చే వారు, తమ వారిని రైళ్లలో ఎక్కించేందుకు, రైళ్లలో వచ్చిన వారిని తీసుకువెళ్లేందుకు వచ్చే వారు ద్విచక్రవాహనాలను రైల్వేస్టేషన్ ముందు వుంచి వెళ్లి వచ్చే సరికి రైల్వే అధికారులు అపరాధరుసుం విధిస్తున్నారు. వాహనాలను స్టేషన్ ముందు ఉన్న స్టాండ్‌లో నగదు చెల్లించి పార్కింగ్ చేసుకోవాలని సూచిస్తున్నారని చెబుతున్నారు. ఇకనైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైల్వేస్టేషన్‌లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సేఫ్టీ ఆడిట్‌లో గుర్తించిన భద్రతా లోపాలను సరిచేసుకోండి

- పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్, ఎస్పీ సూచన



పరిశ్రమల ప్రతిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(విద్య), ఆగస్టు 28: సేఫ్టీ ఆడిట్‌లో గుర్తించిన భద్రతా లోపాలను పరిశ్రమల యజమానులు సరిచేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్, ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమలకు పెద్దపీట వేయడంతో పాటు కార్మికుల భద్రతకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇటీవల జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదవశాత్తు ముగ్గురు మరణించారని, పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త వహించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. ఆమేరకు ఈసమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పారిశ్రామికవేత్తలకు సుహృద్భావ వాతావరణం కల్పిస్తూ పరిశ్రమల విస్తరణకు పెద్దపీట వేస్తున్నామని, కార్మికుల భద్రత కూడా తమకు అత్యంత ప్రధానమని ముఖ్యమంత్రి వెల్లడించారని వారికి వివరించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, అజాగ్రత్త ఎంతమాత్రం కూడదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో జిల్లా యంత్రాంగానికి సమాచారం ఆలస్యంగా అందుతోందని, ఇకపై అలా జరగడానికి వీల్లేదన్నారు. యంత్రాంగానికి తక్షణం సమాచారం అందినప్పుడే తగుచర్యలు తీసుకునేందుకు, నష్టాన్ని నివారించేందుకు వీలౌతుందని చెప్పారు. జిల్లాలో అత్యంత ప్రమాదకర (ఎంఏహెచ్-ఏ) కేటగిరీ పరిశ్రమలు 12, ఎంఏహెచ్-బీ1, బీ2 కేటగిరీల్లో 107 పరిశ్రమలు ఉన్నాయని, భద్రతా ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. సేఫ్టీ ఆడిట్ జరిగిందనే విషయం స్పష్టంగా కనబడేలా ప్రతి పరిశ్రమవద్ద డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని సూచించారు. కార్మికులకు విధులు, విధి నిర్వహణలో వారు ఎదుర్కొనబోయే కష్టనష్టాల గురించి తెలియజేయాలని, ఎప్పటికప్పుడు విధులకు సంబంధించిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి పరిశ్రమలో రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఫైర్ మాక్‌డ్రిల్ చేయాలని సూచించారు. ఆరు నెలలకొకసారి ఆన్‌సైట్ ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించాలని చెప్పారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ... తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, విపత్కర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ ప్లాన్ సిద్ధంగా ఉండాలన్నారు. ఎంట్రీ, ఎగ్జిట్, హాస్పిటల్, ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన ప్రణాళికలు పక్కాగా ఉండాలని చెప్పారు. ప్రమాదకర పరిశ్రమల్లో సెక్యూరిటీ ప్లాన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ బ్లూ ప్రింట్‌ను రెవెన్యూ, పోలీసు యంత్రాగానికి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, పీసీబీ అధికారి మదన్‌గోపాల్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రమణయ్య, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాదరావు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి అధికారి రామ్మూర్తి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, పీసీబీ ఏఈ మదన్‌మోహన్, అమరరాజ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయడం లేదు

మండల సమావేశంలో సర్పంచుల ఆవేదన



తొగరా ముడి ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై సభ దృష్టికి తీసుకువస్తున్న సర్పంచు ప్రసాద నాయుడు

దొరవారిసత్రం, ఆగస్టు 28: మండలంలో కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించడం లేదని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ డిసుజాతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అక్కరపాక, నెల్లూరుపల్లి, ఆనేపూడి, తొగరాముడి గ్రామాల సర్పంచులు అధికారుల పనితీరుపై మండిపడ్డారు. తమలకు గౌరవం ఇవ్వడం లేదని, వైద్యశాఖ అధికారుల పనితీరు బాగా లేదని తెలిపారు. తొగరాముడి వైద్యశాలను సాయంత్రం 4 గంటలకు మూసేసి వెళ్లిపోతున్నారని, ఆస్పత్రి రోగులతో కాకుండా, పశువులతో ఉంటోందని సర్పంచు ప్రసాదనాయుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. దొరవారిసత్రం పీహెచ్‌సీ నుంచి వైద్యులు సమావేశానికి హాజరు కాకపోవడంపై మండిపడ్డారు. అలాగే ట్రాన్స్‌కో ఏఈ గైర్హా జరీపై నోటీసులు ఇవ్వాలని కోరారు. పశువైద్యశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని, వ్యవసాయ, హార్టికల్చర్ పథకాలు, రాయితీలు రైతులకు అందించేలా పనిచేయాలని కోరారు. జీలగలు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు రమేష్, ఉప ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, తహసీల్దారు శైలకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామయ్య, డీఎల్‌డీవో వెంకటశేషయ్య, సీడీపీవో శారదాంబ సహా పలు అధికారులు పాల్గొన్నారు.

మాతా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో ఎమ్మెల్యే తదితరులు

గూడూరు, ఆగస్టు 28: పట్టణంలోని దండోరా నగర్‌లో బుధవారం మాతా పరమేశ్వరి అమ్మవారి ఆలయ శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవనం గడపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు, పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎ.మస్తాన్‌నాయుడు, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పెంచలయ్య, రమణయ్య, జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకారం

దొరవారిసత్రం, ఆగస్టు 28 : దొరవారిసత్రం మండల అభివృద్ధి అధికారిగా బి. సింగయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో దొరవారిసత్రం నుంచి చిత్తూరు జిల్లా యాదమరి మండలానికి బదిలీపై వెళ్లారు. తిరిగి అదే స్థానంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోండి



సీఐని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, ఆగస్టు 28: రెండో పట్టణ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు కోరారు. బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్‌కు టీడీపీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రెండోపట్టణ పరిధిలోని అండర్‌బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా, గంజాయి అక్రమ వ్యాపారాన్ని, జూదాన్ని అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎ.మస్తాన్‌నాయుడు, బి. చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయండి

- మాజీ ఎంపీ నెలవల

ఓజిలి, ఆగస్టు 28: మండలంలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంపై దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం కోరారు. ఓజిలిలోని టీడీపీ నాయకుడు జయ చంద్రా రెడ్డి తల్లి కర్మక్రియలకు హాజరైన ఆయన ఉపాధి హామీ ఏపీఓ ఉషారాణితో మాట్లాడారు. పథకంలో పనులు సక్రమంగా జరిగేందుకు ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలపై దృష్టి పెట్టాలని కోరారు. అంతకుముందు ఆయన నాయకులతో కలసి జయచంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ టీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకటసుబ్బయ్య, పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కె.సత్యవరప్రసాద్‌రావు, నాయకులు ఎస్‌కె ఖలీల్, అల్లాబక్షు, పురుషోత్తంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలను సద్వినియోగం చేసుకోండి

కోట, ఆగస్టు 28: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 30న గ్రీన్‌ల్యాంప్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇక్కడి కళాశాలలో 2022, 23, 24 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు జరుగుతాయన్నారు. డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శరత్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్‌లు తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవం



పెళ్లకూరు, ఆగస్టు 28: పెళ్లకూరు గ్రామంలో బుధ వారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, హోమం వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, పూలతో తీర్చిదిద్దారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

వెల్లుల్లి ....మరీ ఘాటు

కిలో రూ.280 నుంచి రూ.360కి పెరుగుదల



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28: వెల్లుల్లి మరీ ఘాటెక్కింది. దిగుబడి తగ్గిపోవడమే ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్నూలు, ముళబాగల్, ధార్వాడ ప్రాంతాల్లో వెల్లుల్లిని ఎక్కువగా పండిస్తారు.విపరీతమైన వర్షాలు రావడం, గడ్డలు కుళ్లిపోవడంతో దిగుబడి తగ్గి ధరలు అనూహ్యంగా పెరిగాయి. రెండు నెలల క్రితం వరకూ తిరుపతి మార్కెట్‌కు రోజుకు 50 టన్నుల వరకు వెల్లుల్లి వచ్చేది. గుజరాత్ నుంచి 70 శాతం దిగుమతి చేసుకునే వారు. అక్కడ కూడా వెల్లుల్లి పంట ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రస్తుతం తిరుపతి మార్కెట్‌కు 25 టన్నులు మాత్రమే వస్తుండడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.రెండు నెలల క్రితం కిలో రూ.200 వరకు పలికిన వెల్లుల్లి రెండు వారాలుగా మరో రూ.80పెరిగింది. ప్రస్తుతం అరకిలో వెల్లుల్లి రూ.180కి చేరుకుంది.దిగుబడులు ఇలాగే వుంటే రెండు మూడు వారాల్లో కిలో రూ.500కు వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు పెంపొందించుకోవాలి

ఎకనమిక్స్ జాతీయ సదస్సులో వక్తల మనోభావం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఆగస్టు 28: అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను పెంపొందించుకోవడం ద్వారా ఆయా దేశాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని కొలంబో యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.అమృత లింగం అభిప్రాయపడ్డారు. 'ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ - ద సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఛాలెంజెస్' అంశంపై ఎస్వీయూ - పద్మావతి యూనివర్సిటీలు సంయుక్తంగా బుధవారం జాతీయ సదస్సు చేపట్టాయి. పద్మావతి వర్సిటీ సావేరి హాల్లో జరిగిన ప్రారంభ సభలో ప్రొఫెసర్ అమృతలింగం కీలకోపన్యాసం చేశారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను పెంపొందించుకునే సందర్భంలో శ్రీలంక విఫలమైందన్నారు. కరోనా సమయంలో చైనా సహకారంతో ముందుకు వెళ్లవలసి ఉండేదని తెలిపారు. భారతదేశంతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను పెంచుకోవడం ద్వారా శ్రీలంకకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. ఆర్థిక శాస్త్ర విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని సూచించారు. పద్మావతి వర్సిటీ డీన్ కిరణ్ ప్రసాద్ మాట్లాడుతూ.. కరోనా, యుద్ధ సమయాల్లో వివిధ దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు. సదస్సు కన్వీనర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత, పలు ప్రాంతాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల సాగు ద్వారా స్థూల జాతీయ ఉత్పత్తి పెంపు

వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజశేఖర్

తిరుపతిరూరల్, ఆగస్టు 28: వ్యవసాయరంగంలో ప్రధానపంటల సాగు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువజోడింపు, విదేశాలకు ఎగుమతుల ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పతిని పెంచేందుకు కృషి చేయాలని వ్యవసాయశాఖ రాష్ట్ర ప్రత్యేకప్రధానకార్యదర్శి బి. రాజశేఖర్ తెలిపారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో వికసిత్ ఆంధ్రా-2047 అనేఅంశంపై అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు, ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలకు ఒకరోజు సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి, ప్రధానపంటల్లో అధిక దిగుబడి సాధించేందుకు చేపట్టాల్సిన మెరుగైన నూతన విధానాలు, మార్కెట్ అంచనాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రధాన పంటల సాగు, విస్తీర్ణం, ప్రస్తుత దిగుబడులు, ప్రధానపంటల దిగుబడులు పెంచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణని అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు వివరించారు. రైతుల ఆదాయం పెంపుతోపాటుగా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పతిని పెంచేందుకు గ్రామస్థాయి నుంచి చేపట్టాల్సిన కార్యాచరణపై సూచనలు చేశారు. వ్యవసాయవర్సిటీ విస్తరణ విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ప్రమీలరాణి మాట్లాడుతూ... వర్సిటీలో పరిశోధన, విస్తరణ విభాగాల ద్వారా లక్ష్యాలను చేరుకునేందుకు కొత్త పరిశోధనలు చేపట్టాలని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ మెరుగైన పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన పంటలసాగుని వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ కె.నిర్మల్ రవికుమార్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల ట్రేడింగ్, విదేశాలకు ఎగుమతి ద్వారా స్థూల దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పంటకోతల అనంతరం చేపట్టాల్సిన నూతన సాంకేతికత, ప్రాసెసింగ్, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు వంటి అంశాలనుడాక్టర్ విష్ణువర్ధన్ విశదీకరించారు.

శాస్త్రోక్తంగా కృష్ణస్వామి ఆలయ కుంభాభిషేకం





కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు - స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం



ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులకు ఆశీర్వచనం

సూళ్లూరుపేట, ఆగస్టు 28: పట్టణ సమీపంలోని మన్నారుపోలూరులో కొలువై ఉన్న ఉన్న సత్య జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న అష్టబంధన కుంభాభిషేక వేడుకలు ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయ ముందు కలశ పూజ చేసి కలశాల్లో ఉన్న పవిత్ర జలాలతో ఆలయ గోపురంపై ఉన్న కలశాలకు అభిషేకం చేసి మహా సంప్రోక్షణ నిర్వహించారు. కుంభాభిషేక జలాలను భక్తులపై చల్లారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే విజయశ్రీ కుటుంబ సభ్యులతో విచ్చేశారు. టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ లోకేశ్‌రెడ్డి ఎమ్మెల్యే దంపతులకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి వేద పండితులతో ఆశీర్వవచనం ఇప్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం తిరువీధి ఉత్సవం నిర్వహించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న సర్వేయర్

భూసర్వే పక్కాగా నిర్వహించాలి

కోట, ఆగస్టు 28: భూ సర్వేలో ఎక్కడా లోపాలకు తావు లేకుండా నిర్వహించాలని మండల సర్వేయర్ రామ్‌కుమార్ ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం 16 గ్రామ సచివాలయాల సర్వేయర్లకు భూ సర్వేపై శిక్షణ జరిగింది. కొత్తపట్నం పంచాయతీలో జరుగుతున్న చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ భూముల్లో మిగిలిపోయిన సర్వేను వేగవంతం చేయాలన్నారు.

పాండురంగడి గ్రామోత్సవం



సూళ్లూరుపేట, ఆగస్టు 28: పట్టణం లోని రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా ముగింపు రోజు స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తుల కోలా టాలు, భజన బృందాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. అంతకుముందు ఉదయం స్వామివారికి అభిషేకం చేసి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు ఎం.బాలసుబ్రమణ్యం, టీడీపీ నాయకులు ఏ.రమేష్, ఏజి కిషోర్, వి.రమేష్, చిట్టేటి పెరుమాల్, పి.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియో మీటర్ల పరిశీలన

కోట, ఆగస్టు 28 : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఫిజియో మీటర్లను బుధవారం భూగర్భ జల, జలగణన శాఖ జియాలజిస్టు రాజారాం పరిశీలించి కొలతలు తీశారు. మండలంలోని వంజివాక, కోట, చిట్టమూరు మండలం మెట్టులో ఉన్న ఈ ఫిజియో మీటర్ల ద్వారా భూగర్భ జల మట్టాన్ని కొలతలు తీస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో 6, 7, 8 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయని రాజారాం తెలిపారు. జిల్లాలోని 33 మండలాల్లో 88 ఫిజియో మీటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.97కోట్లు



హుండీ లెక్కింపు చేస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది

శ్రీకాళహస్తి, ఆగస్టు 28: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,97,72,140 వచ్చింది. బుధవారం ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద హుండీల ఆదాయాన్ని లెక్కించారు. బంగారం 98 గ్రాములు, వెండి 605.098 కేజీలు, విదేశీ కరెన్సీ 233 వచ్చాయి. గత నెల 24వ తేదీ నుంచి వచ్చిన హుండీ ఆదాయం. కార్యక్రమంలో ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రమేష్‌బాబు సేవలు అభినందనీయం



రమేష్‌బాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 28: శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్‌గా రమేష్‌బాబు అందించిన సేవలు అభినందనీయమని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. కమిషనర్ రమేష్‌బాబు పొన్నూరుకు బదిలీ అయిన నేపథ్యంలో బుధవారం ఆయనను టీడీపీ నాయకులు సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పురపాలక సంఘం అభివృద్ధిలో రమేష్‌బాబు వేసిన ముద్ర చెరగదన్నారు. 2014, 2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రమేష్‌బాబు శ్రీకాళహస్తి పురపాలక సంఘాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని చెప్పారు. పారిశుధ్య నిర్వహణలో శ్రీకాళహస్తికి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పట్టణంలో 6.5కిలోమీటర్ల మేర డ్రైనేజీ కాలువల్లో యుద్ధప్రాతిపదికన పూడిక తొలగించి అందరి ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన ప్రియదర్శిని



విద్యార్థిని అభినందిస్తున్న మయూర్

శ్రీకాళహస్తి, ఆగస్టు 28: చెన్నైలోని పొన్నేరిలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియనషిప్‌లో శ్రీకాళహస్తి పట్టణం ఎంజీఎం పాఠశాలకు చెందిన యూకేజీ చదువుతున్న ప్రియదర్శిని సత్తా చాటింది. 6 సంవత్సరాల విభాగంలో రెండవ బహుమతి సాధించింది. ప్రియదర్శిని, కరాటే మాస్టర్ సంపత్ కుమార్‌ను గుడ్లూరు మయూర్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌వోఎస్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ మేనేజరు తేజస్విని

ఏర్పేడు, ఆగస్టు 28: ఏర్పేడు మండలంలోని నచ్చనేరి వద్ద గల ఎస్‌వోఎస్‌లో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఎస్‌వోఎస్ లోకేషన్ ఇన్‌చార్జి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏర్పేడు డీసీసీబీ మేనేజరు తేజస్విని మాట్లాడుతూ బడ్జెట్, పొదుపు, స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్, కుటుంబ ఆర్థిక వ్యవహారాలను ఎలా సమర్థవంతంగా నిర్వహించాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ సంస్థ ప్రతినిధి మునిరత్నం, డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

చింతలపాళెంలో నగర సంకీర్తన

ఏర్పేడు, ఆగస్టు 28: ఏర్పేడు మండలంలోని చింతలపాళెం గ్రామంలో బుధవారం కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా నగర సంకీర్తన నిర్వహించారు. భగవద్గీతకు సంబంధించి శ్లోకాలను పారాయణం చేశారు. శ్రీకృష్ణుడి చిత్ర పటాన్ని ఊరేగించారు. త్రైత్రయి సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, గాయత్రి సిద్ధాంత భగవద్గీత సేవాసమితి సభ్యులు వెంకటలక్ష్మి, రాజేష్‌యాదవ్, సురేష్‌యాదవ్, పెంచలయ్య పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 28: మండలంలో జీఎన్‌కండ్రిగ గ్రామంలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచు మునీశ్వరి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశువైద్య సహాయ సంచాలకుడు మునిరాజా, డాక్టర్ వీరభద్రరెడ్డి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భకోశ వ్యాధులు కలిగిన పశువులకు చికిత్స చేసి మందులు అందజేశారు.

బాల్య వివాహం అడ్డగింత

వరదయ్యపాళెం, ఆగస్టు 28: బాల్య వివాహ ప్రయత్నాలను సీడీపీవో ఆధ్వర్యంలో అధికారులు అడ్డుకున్నారు. సత్యవేడు మండలం కన్నావరానికి చెందిన ఓ బాలిక ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. బంధువుల యువకుడితో వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించడంతో ఇష్టంలేని బాలిక వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలోని తమ బంధువుల ఇంటికి చేరింది. స్థానికుల సమాచారంతో సీడీపీవో దేవకుమారి బాలిక తల్లిదండ్రులను సత్యవేడు సీడీపీవో కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకులు జ్యోతి, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

6నుంచి విద్యార్థులకు పోటీలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 28: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6వ తేదీ నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి ఎస్‌వీఆర్ ప్రసాద్ తెలిపారు. రోటరీక్లబ్ ఆవరణలో 6వ తేదీ రంగోలి, 13న డ్యాన్స్ పోటీలు, 20న చిత్రలేఖనం, 27న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే బాలబాలికలు ఈ పోటీలకు హాజరు కావాలని కోరారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకారం



ఈశ్వరయ్య, రామస్వామి

శ్రీకాళహస్తి/సత్యవేడు, ఆగస్టు 28: తొట్టంబేడు ఎస్‌ఐగా కె.ఈశ్వరయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎర్రావారిపాళెం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే సత్యవేడు ఎస్‌ఐగా రామస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి నగరంలోని అలిపిరి స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

బీసీ హాస్టల్‌కు మరమ్మతులు

రేణిగుంట, ఆగస్టు 28: రేణిగుంటలోని బీసీ హాస్టల్‌లో మరమ్మతు పనులను బుధవారం చేపట్టారు. కొత్త తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే హాస్టల్‌లో లైట్లు, ఫ్యాన్లను అమర్చారు. తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. అలాగే కొత్తగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

సీఎం ప్రకటన హర్షణీయం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 28: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.25వేలు కనీస వేతనం అమలు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని సత్యవేడు నియోజక వర్గ టీడీపీ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేడాం వెంకటచలం అన్నారు.

ఘనంగా సుమన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సుమన్

రేణిగుంట, ఆగస్టు 28: ప్రముఖ సినీనటుడు సుమన్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తిరుపతి సమీపంలోని కరకంబాడిలో గల మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వగృహంలో అమరరాజా వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రనాయుడు సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అమరరాజా సంస్థ ఉద్యోగులు, సుమన్ అభిమానులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సుమన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. మోహన్ గౌడ్, శ్రీరాములు గౌడ్, పురుషోత్తంగౌడ్, వెంకటరమణగౌడ్, కృష్ణయ్యగౌడ్, మునిశేఖర్‌గౌడ్, సూరిప్రకాష్ గౌడ్, ప్రేమ్ కుమార్ గౌడ్, దిలీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు సమగ్రాభివృద్ధే లక్ష్యం: ఆదిమూలం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఆగస్టు 28: సత్యవేడు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. బుధవారం సత్యవేడులో రూ.1.70 కోట్లతో నిర్మించనున్న టీటీడీ కల్యాణ మండపానికి అధికారులు, స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆదిమూలం మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద, మధ్య తరగతుల కుటుంబాలు వివాహాది శుభకార్యాలను ప్రైవేటు కల్యాణ మండపాలను ఆశ్రయించకుండా తక్కువ ఖర్చులతో శుభకార్యాలను చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలో సహజ వనరులను లూటీ చేసిన ప్రతి ఒక్కరి పాపాల లెక్కలు తేలుతాయన్నారు. రాజకీయాలంటే ప్రజలకు సేవ చేయడమే కానీ దోచుకోవడం కాదన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల దశల వారీగా అభివృద్ధి చేసి తనను ఎన్నుకున్న ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపం, దాసుకుప్పం బైపాస్ రోడ్డు, ఆరణియార్ ఆధునికీకరణ, డ్రైనేజీ కాలువల నిర్మాణం తదితర పనులను చేపట్టి ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో సర్పంచు మంజుల, టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున ప్రసాద్, డీఈ భాస్కర్, ఏఈ మునిప్రసాద్, సీఐ మురళి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, ఎస్‌ఐ రామస్వామి, నాయకులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సుందరరామిరెడ్డి, మస్తాన్, బీబీఎస్ రెడ్డి, పరమశివం, చిన్న, యుగంధర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రామాంజులు నాయుడు, గోపినాథ్‌రెడ్డి, కన్నయ్య నాయుడు, ఇళంగోవన్ రెడ్డి, రూపేష్ కుమార్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ చెల్లింపుల్లో శ్రీసిటీ పనితీరు భేష్



ఆనంద్ కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, ఆగస్టు 28: జీఎస్టీ చెల్లింపుల్లో శ్రీసిటీ పనితీరు బాగుందని ఏపీ సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పీ.ఆనంద్‌కుమార్ కితాబునిచ్చారు. బుధవారం ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీ గురించి వివిధ అంశాలను తెలుసుకునేందుకు ఎంతో ఆసక్తి కనబరచిన ఆనంద్ కుమార్ శ్రీసిటీ అభివృద్ధి పట్ల యాజమాన్య కృషిని ప్రశంసించారు. బహుళ రంగాల్లో పెరుగుతున్న ఎగుమతి కార్యకలాపాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆనంద్ కుమార్ పరిశీలనలు, సూచనలు శ్రీసిటీ అభివృద్ధికి అత్యంత విలువైనవిగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు.

సచివాలయ సిబ్బంది, ఎస్ఎంసీ సభ్యులే
మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 28: పాఠశాలల్లో మరుగుదొడ్లను ఫొటో తీసి అప్‌లోడ్ చేసే బాధ్యత సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులదేనని ఇన్‌చార్జి ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో టాయిలెట్ మానిటరింగ్ సర్వే మీద సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ సోమ, గురువారాల్లో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, బుధ, శుక్రవారాల్లో ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్‌లు వారికి కేటాయించిన పాఠశాలల్లో మరుగుదొడ్లను ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయలన్నారు. సమావేశంలో రెండవ ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొత్త నాంచారమ్మను దర్శించుకున్న ఆదిమూలం



పిచ్చాటూరు, ఆగస్టు 28: మండలంలోని రెప్పాలపట్టు గ్రామంలో అరుణా నది ఒడ్డున నూతనంగా నిర్మించిన కొత్త నాంచారమ్మ దేవాలయ కుంభాభిషేక మహోత్సవంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని వివిధ రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డిని గ్రామస్తులు సత్కరించారు.

కబ్జాదారుల నుంచి కాపాడండి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న దళితులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 28: కబ్జాదారుల చెర నుంచి దళిత రైతుల భూములను కాపాడాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. బుధ వారం వారు తొట్టంబేడు తహసీల్దారు మధుసూదనరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివనాథపాళెం దళితులు మాట్లాడుతూ తమ గ్రామంలో 20 ఎకరాల భూమిపై శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కన్నేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. ఇటీవల వారు తమను బెదిరిస్తున్నారని, కబ్జాదారుల నుంచి తమ భూములను కాపాడాలని వినతిపత్రం సమర్పించారు.

మాచేలమ్మ ఆలయ కుంభాభిషేకం

వరదయ్యపాళెం, ఆగస్టు 28: మండలంలోని కాంబాకం కొండల్లో వెలసిన మాచేలమ్మ దేవికి నూతనంగా నిర్మించిన ఆలయంలో మహాకుంభాభిషేకం బుధవారం నుంచి ప్రారంభమైంది. వేదమంత్రోచ్చరణల మధ్య మాచేలమ్మ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచు దీప జయచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ పోలయ్య, టీడీపీ నాయకులు రాజేష్‌రెడ్డి, నరేంద్ర తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మా భూములు లాక్కోవద్దు



నిరసన తెలుపుతున్న బత్తలవల్లం గ్రామస్తులు

వరదయ్యపాళెం, ఆగస్టు 26: తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవద్దని బత్తలవల్లం గ్రామస్తులు అటవీశాఖ అధికారులను వేడుకుంటున్నారు. బుధవారం వారు భూముల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తమ పూర్వీకుల నుంచి ఈ భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. అయితే అటవీశాఖ అధికారులు తమ భూములు లాక్కునేందుకు ఆక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆత్మార్పణ దినోత్సవాన్ని
అధికారికంగా నిర్వహించడం హర్షణీయం

శ్రీకాళహస్తి, ఆగస్టు 28: వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం హర్షణీయ మని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యుడు వాకిచర్ల గురప్పశెట్టి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వాసవి కన్యకాపర మేశ్వరి ఆత్మరణ దినోత్సవాన్ని టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మంత్రి మండలి ఆమోదం తెలపడం టీడీపీకి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేసిందన్నారు.

పుత్తూరు వార్తలు

లైన్‌మాన్ అదృశ్యం



ఉమాశంకర్

వడమాలపేట ఆగస్టు 28: వడమాలపేట మండలంలోని అప్పలాయగుంట సబ్‌స్టేషన్‌లో లైన్‌మాన్‌గా పనిచేస్తున్న ఉమాశంకర్ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... పుత్తూరు బెస్తవీధిలో నివాసం వుంటున్న ఉమాశంకర్(46) గత ఏడాది అప్పలాయగుంటకు బదిలీపై వచ్చారు. సోమవారం ఉదయం విధులకు వచ్చిన ఆయన మంగళవారం ఉదయం డ్యూటీ దిగి వెళ్లారు. సాయంత్రం అవుతున్నా భర్త ఇంటికి రాకపోగా, ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండడంతో ఉమాశంకర్ భార్య మయూరి అప్పలాయగుంట సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి వాకబు చేసింది. మంగళవారం ఉదయమే డ్యూటీ దిగి వెళ్లిపోయారని అక్కడి సిబ్బంది చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఉమాశంకర్‌కు కరోనా సోకి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారని, ఇందుకు సుమారు ఎనిమిది లక్షల రూపాయలు ఖర్చయ్యాయని, అప్పటి నుంచి డిప్రెషన్‌లో వున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. కాగా, ఉమాశంకర్ భార్య మయూరి పుత్తూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది.

వేతనాలు మంజూరు చేయించండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 28: పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు ఏఐటీయూసీ నాయకుడు మహేష్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా జీతాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే పీఎఫ్, ఈఎస్‌ఐ సక్రమంగా చెల్లించడం లేదన్నారు. కార్మికుల వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి జీతాలు ఇప్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు శబూను, పాల్‌రాజ్, సుజాత, శివమ్మ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణలో ఎలక్ట్రిక్ వెహికల్స్ కీలకం: భానుప్రకాష్



చార్జింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, ఆగస్టు 28: రోజురోజుకు పెరుగుతున్న కాలుష్య నివారణలో భాగంగా ఎలక్ట్రిక్ వెహికల్స్ వాడుకలోకి రావడం శుభసూచకమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. బుధవారం పుత్తూరు బైపాస్‌రోడ్డు వద్ద జనరిక్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రత్యామ్నాయ పాత్ర పోషిస్తాయన్నారు. పెద్ద నగరాల్లో మాత్రమే ఉండే ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ కేంద్రాన్ని పుత్తూరులో ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన పీసీ.కృష్ణంరాజును ఎమ్మెల్యే అభినందించారు. అలాగే కృష్ణంరాజు కుటుంబసభ్యులు ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. అనంతరం పుత్తూరు పట్టణంలోని శ్రీకృష్ణ మల్టీస్పెషాలిటీ డెంటల్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, మాజీ ఎంపీపీలు డీఎస్ ఎలుమలై, గంజి మాధవయ్య, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, సుభాషిణి ఆస్పత్రి అధినేత శ్రీధర్‌రాజు, శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఎస్‌బీఆర్‌పురం సర్పంచు మణిరాజు, చంద్రశేఖర్‌రాజు, ధనంజయులు నాయుడు, సత్యనారాయణరాజు, కోలా సుధాకర్, కుప్పయ్య, రవిశేఖర్‌రాజు, పెద్దబ్బరాజు, మాధవరాజు, సుబ్రహ్మణ్యం యాదవ్, బాల్‌రెడ్డి, శ్రీధర్‌వర్మ, ఉమాపతిరావ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు



రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వడమాలపేట ఆగస్టు 28: జాతీయస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట ఉన్నత పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. ఈనెల 25 నుంచి రెండు రోజులపాటు రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు జరిగాయి. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట విద్యార్థులు 13 మంది బంగారు, 9మంది రజత(వెండి), 9మంది కాంస్య పతకాలు సాధించారు. వీరిలో బంగారు, రజత పతకాలు సాధించిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని పీడీ తెలిపారు. వీరు అక్టోబరులో హర్యానాలోని రోహతక్‌లో జరిగే జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.